క్లుప్తంగా

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



తాటిపాడు వద్ద మట్టి నమూనా సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

జూపాడుబంగ్లా: ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అందుకనుగుణంగా పంటలు సాగుచేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో రైతులకు ఆసక్తి ఉన్నా భూసార పరీక్షలు చేయించుకోవడం కష్టంగా ఉండేదన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఆశ్రయిస్తే చాలు అక్కడి సిబ్బంది రైతుల వెంట పొలాలకు వచ్చి మట్టినమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్‌ల నుంచి వచ్చిన సమాచారాన్ని రైతులకు తెలియజేసి అందకనుగుణంగా వారి పొలాల్లో ఎంతశాతం మేర ఎరువులు వాడలో వివరిస్తారన్నారు.

వర్షిత్‌కు జిల్లా స్థాయి 3వ బహుమతి



జిల్లా కలెక్టర్, ఎంపీ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న వర్షిత్

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో 10వ తరగతి చదివిన విద్యార్థి పసుపుల వర్షిత్ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో 3వ బహుమతి పొందాడని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చంద్రశేఖరరెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని కృష్ణారావుపేట గ్రామానికి చెందిన వర్షిత్‌ను నంద్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిల చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాడని చెప్పారు. 10వ తరగతిలో 600 మార్కులకు 579 మార్కులు సాధించాడని వివరించారు. ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపల్ నాగరవీంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు అభినందించారు.

ఘనంగా ఫాదర్స్ డే

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.సునీత అధ్యక్షతన తెలుగు అధ్యాపకుడు ఎం.అన్వర్ హుస్సేన్ పర్యవేక్షణలో శనివారం డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని వి.పల్లవి కన్వీనర్‌గా ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఎదుగుదలలో తండ్రి ప్రధాన పాత్ర వహిస్తాడన్నారు. సర్వస్వం తానై తన సంతానం కోసం తన జీవితాన్ని అర్పిస్తాడని, ఆయన త్యాగాన్ని వెల కట్టలేమని తెలియజేశారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు.

బైకు లారీ ఢీ.. వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి బైకు లారీ ఢీ కొట్టుకున్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల మేరకు నందికొట్కూరు పట్టణానికి చెందిన సంజీవకుమార్ (38) శుక్రవారం బైకుపై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. మెరుగైన చికిత్సకోసం 108 ద్వారా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడు పట్టణంలోని నవనంది హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు.

ఎర్రమట్టి రవాణాపై ఉన్నతాధికారుల ఆరా

మహానంది: గోపవరం సమీపంలోని బైరవాణి చెరువు వద్ద జరుగుతున్న ఎర్రమట్టిరవాణాపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిన్ననీటిపారుదలశాఖ ఏఈ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఏఎస్ఐ బాలచంద్రుడు తదితరులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వారు, మట్టిని ఎక్కడ డంప్ చేసుకున్నారన్న అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ప్రైవేటు పాఠశాల బస్సుకు జరిమానా

ఆత్మకూరు: పట్టణంలోని ప్రైవేటు పాఠశాల పద్మావతి హైస్కూల్‌కు చెందిన బస్సుకు కండీషన్ లేకపోవడంతో ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి శనివారం జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు చెందిన మినీ బస్సు కండీషన్ లేకపోవడం, బస్సుకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రోడ్డు ట్యాక్స్ లేనందున రోడ్డుపై నడపటం చట్టరీత్యా నేరమన్నారు. ఇందుకు రూ.24వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. పట్టణంలోని పది ట్రాక్టర్లకు లైసెన్స్‌లు, కండీషన్లు లేకపోవడంతో మరో రూ.76వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

ప్రతిభకు సత్కారం.. విద్యకు ప్రోత్సాహం

- పది, ఇంటర్‌లో టాపర్లకు జగనన్న ఆణిముత్యాలు ద్వారా ప్రభుత్వ సత్కారం
- నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం
- జిల్లా, నియోజకవర్గ, మండల, పాఠశాల స్థాయిలో విద్యార్థుల ఎంపిక



జూపాడుబంగ్లాలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నియోజకవర్గంలో ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులు - 154 మంది
అందజేసిన ప్రోత్సాహకం - రూ.3.44 లక్షలు

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరికీ విద్య దరిచేరింది. పేదల ఇంట చదువుల పంట పండింది. అలాంటి మట్టిలో మాణిక్యాలను ప్రభుత్వం సత్కరిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పది, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా అవార్డులు అందిస్తుంది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి, వారి తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్‌ను సత్కరించడమే కాకుండా విద్యార్థులకు నగదు ప్రోత్సహకం, సర్టిఫికెట్లు అందజేస్తుంది.

నియోజకవర్గంలో 152 మంది ఎంపిక

నియోజకవర్గంలో 152 మంది ఆణిముత్యాలను ప్రభుత్వం ఎంపిక చేసి రూ.3.44 లక్షలు పంపిణీ చేసింది. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో కొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన మీనిగ వివేకనంద రూ. 15 వేలు, పాములపాడు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన పసుపుల వర్షితకు రూ.15 వేలు, వేంపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన దేశావత్ మౌల్య శ్రీబాయికి రూ.15 వేలు చొప్పన ప్రభుత్వం అందజేసింది. అదే విధంగా ఇంటర్మీడియెట్‌లో జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్ నుంచి నందిని, ఎంపీసీ మొదటి స్థానంలో నిలువగా, పాములపాడు మోడల్ స్కూల్ విద్యార్థులు నాగరేణుక ఎంపీసీ, స్వాతి హెచ్‌ఈసీ రెండు, మూడో స్థానంలో బహుమతులు అందుకున్నారు. మండలాల స్థాయిలోనూ కార్యక్రమాలను నిర్వహించి అవార్డులను అందజేస్తున్నారు.

మండలాల వారీగా..

నందికొట్కూరు-29 మంది విద్యార్థులకు రూ. 59 వేలు , పగిడ్యాల-22 మందికి రూ. 43 వేలు, మిడుతూరు-35 మంది రూ. 71 వేలు, జూపాడుబంగ్లా-24 మంది రూ.48 వేలు, పాములపాడు-21 మందికి రూ.42 వేలు, కొత్తపల్లి-18 మంది విద్యార్థులకు గాను రూ.36 వేలు చొప్పున వివిధ కేటగిరీల వారీగా అవార్డులు అందించింది. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రోత్సహకం అందజేస్తున్నారు.

పాఠశాల స్థాయిలో ప్రతిభకు పతకాలు

ఆయా మండలాల్లో జెడ్పీ హైస్కూల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల్లో చదువుతున్న పదోవ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేస్తున్నారు. పాఠశాలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 3 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 2 వేలు, తృతీయ స్థానానికి రూ, వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. నియోజకవర్గంలో 50 హైస్కూళ్లలో 154 మందిని అవార్డులకు ఎంపిక చేశారు.

ఈ స్ఫూరితో మరిన్ని విజయాలు సాధిస్తా



ఇంటర్మీడియెట్ ఎంపీసీలో గ్రూపులో 966 మార్కులు సాధించాను. దీంతో జగనన్న ఆణిముత్యాలు ద్వారా అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పేద విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇలాంటి పథకాలను రూపొందించడం అభినందనీయం. ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధిస్తా.
– నందిని ఎంపీసీ, మోడల్ స్కూల్ జూపాడుబంగ్లా

ఆనందంగా ఉంది



అత్యధిక మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు ద్వారా అవార్డులకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం. పదో తరగతిలో 567 మార్కులు సాధించాను, దీనికి ఉపాధ్యాయులందరి తోడ్పాటు మరవలేనిది.
– యశస్విని, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, నందికొట్కూరు

విద్యార్థుల అభ్యున్నతికి దోహదం



ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. అవార్డు గ్రహీతలు ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్లేందుకు, వీరిని చూసి మరికొంత మంది విద్యార్థులు స్ఫూర్తిని పొందేందుకు ఈ అవార్డులు ఎంతగానో దోహదపడుతాయి. మా స్కూల్ పదో తరగతి విద్యార్థిని యశస్విని 567 మార్కులు సాధించి మండల స్థాయిలో నిలిచింది. మండల స్థాయిలో అవార్డులు దక్కడం సంతోషంగా ఉంది.
– పార్వతి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, నందికొట్కూరు

నియోజకవర్గ టాపర్ సుమలతకు బంగారు మెడల్



సుమలతకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్, ఎంపీ, ప్రజాప్రతినిధులు

మహానంది: బండిఆత్మకూరు మోడల్ స్కూల్‌లో చదువుతూ ఇంటర్ ఫలితాల్లో 971 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచిన కె.సుమలతకు శనివారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, తదితరులు సర్టిఫికెట్, నగదు బహుమతి అందించి సత్కరించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఆణిముత్యాలు కార్యక్రమంలో రూ. 5వేలు నగదు బహుమతి అందించారు. అలాగే ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుల్ రాఫిని సన్మానించి ప్రశంసించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న సెలవు విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు రామేశ్వరరావు, నాగేంద్రుడు, వెంకటేశ్వరరావు, సామన్న, బాలఏసు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మహానంది: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతంగా పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ నంద్యాల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.భాస్కర్‌నాయుడు ఆదేశించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.పరమేశ్వరితో కలిసి జగనన్న కాలనీని సందర్శించారు. పీడీ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ వాసుదేవగుప్త, హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండిఆత్మకూరులో అధికారులతో మాట్లాడుతున్న పీడీ భాస్కర్‌నాయుడు

పాములపాడు: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ గోపికృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను సందర్శించారు. యన వెంట డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఏఈ హౌసింగ్ శివరామ కృష్ణారెడి పాల్గొన్నారు.

మిడుతూరు: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు చైతన్యం కల్పించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం అన్నారు. శనివారం సుంకేసుల గ్రామంలో జగనన్న కాలనీ పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

51 మంది వలంటీర్లకు నోటీసులు

మహానంది: వలంటీర్లకు వందనం కార్యక్రమానికి గైర్హాజరైన 51మంది వలంటీర్లకు కారణాలు కోరుతూ మండల అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో వలంటీర్లు శుక్రవారం వ్యక్తిగతంగా వివరణ రాసిస్తూ అందించేందుకు కార్యాలయానికి చేరుకున్నారు. మహానంది మండలంలో మొత్తం 182 మంది వలంటీర్లు ఉండగా వలంటీర్లకు వందనం కార్యక్రమానికి 51మంది గైర్హాజరయ్యారు. వారిలో గాజులపల్లె రెండు సచివాలయాల నుంచే అధికంగా గైర్హాజరవడం విశేషం.

బోదకాలు బాధితులకు సామగ్రి పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాలు వెంకటాపురం, కృష్ణాపురం, సిద్దపల్లి, నల్లకాలువ, కరివేన గ్రామాలోల బోదకాలు వ్యాధి గ్రస్తులకు డాక్టర్లు గోపాల్, పవన్ కుమార్ శనివారం మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్‌మాసం మలేరియా మాసం కాబట్టి ప్రతి ఒక్కరూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బోదకాలు వ్యాధి గ్రస్తులకు ఒక టబ్, సబ్బు, టవల్, ఆయిట్‌మెంటు అందజేశారు. ప్రతి రోజు వేడి నీటిని టబ్బులో పోసి అందులో కాలును శుభ్రంగా కడుక్కొని, టవల్‌తో తుడుచుకొని, ఆయిట్‌మెంటు పట్టించుకోవాలని సూచించారు. 27 మందికి ఆ మెటీరియల్‌ను అందజేశారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

పగిడ్యాల: మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ మైనార్టీ కో ఆర్డినేటర్ అబూబకర్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ హం సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జామియా మసీదులో ముస్లింలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని మసీదుల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని మౌజన్లను కోరారు. ఏ ప్రభుత్వం మౌజన్ల గురించి ఆలోచించలేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే వారి ఆలనా పాలనా చూశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు ఎం. మహబూబ్‌బాషా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

నందికొట్కూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో సర్పంచ్ జనార్దన్‌గౌడుతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మండలంలోని గ్రామీణ రహదారులకు మోక్షం వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంట్రాక్టర్ శివనాగిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శాతనకోటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, నాయకులు

తల్లీబిడ్డల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

మహానంది: తల్లీబిడ్డల సంరక్షణపై వైద్యసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి డాక్టర్ కిరణ్ తెలిపారు. బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామంలో శనివారం వ్యాక్సినేషన్ అమలు, గర్భిణులకు అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో వ్యాక్సినేషన్‌ను సకాలంలో చేపట్టాలన్నారు. జన్మనిస్తూ ఏ తల్లీ, జన్మించిన ఏ శిశువూ మృతి చెందకూడదన్న లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సవిత, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎంఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యాక్సిన్లను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నందికొట్కూరులోని దుకాణంలో రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ఫర్టిలైజర్ దుకాణాదారులు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల ఏడీఏ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని విత్తనాల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పట్టణంలోని లలిత సీడ్స్, మల్లికార్జున సీడ్స్ దుకాణాల్లో స్టాకు రిజిష్టర్‌లను, బిల్లులను పరిశీలించి సరైన సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు లేని కారణంగా ఆయా దుకాణాలలో స్టాకు అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. ఏఓ షేక్షావలి పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి

ఆత్మకూరు: విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఎక్కడైనా అనధికారికంగా విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే తహసీల్దార్ 8333988972, వ్యవసాయాధికారి 8331057465, ఎస్ఐ 9121101182 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు.

నీటి సరఫరా బిల్లుల చెల్లింపు

మిడుతూరు: మండలంలో 2019-20 సంవత్సరానికి చేపట్టిన ట్రాన్స్‌పోర్టేషన్ డ్రింకింగ్ వాటర్ అండర్ ఎస్‌డీఆర్ఎఫ్ గ్రాంట్ పెండింగ్ బిల్లులు అకౌంట్లలో జమ చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్ తెలిపారు. అలగనూరు, నాగలూటి, సుంకేసుల, చౌట్కూరు, 49-బన్నూరు, కడుమూరు, దేవనూరు, గుడిపాడు గ్రామాల్లో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారని తెలిపారు. సంబంధిత పెండింగ్ బిల్లులు విడుదలైనట్లు ఏఈ వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

జూపాడుబంగ్లా: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ట్రాన్స్‌కో లక్ష్యమని నందికొట్కూరు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని మండ్లెం విద్యుత్ ఉపకేంద్రం వద్ద వినియోగదారులు, రైతులతో సమావేశం నిర్వహించారు.ఏడీ శ్రీనివాసులు, ఏఈ రామాచారి మాట్లాడుతూ రైతులకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిరంతరాయంగా 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాకోసం దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించిన కేవలం నెల రోజుల్లోనే కనెక్షన్ ఇస్తున్నామన్నారు. పారుమంచాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సమస్యలను కూడా హేమశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఏడీఈ, ఏఈ దృష్టికి తేచ్చారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ఎస్ఈ కార్యాలయంలో ఉన్నాయని మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ రామాచారి

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

మహానంది: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం ఆగదని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు మాదిగ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలన్నారు. పోరాటాల ద్వారా ఏదైనా సాధించవచ్చని చెప్పారు. సమావేశంలో నాయకులు బాయికాటి బెనర్జీ మాదిగ, కోలా కళ్యాణ్, పూల వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఒంటిపూట బడులు

కొత్తపల్లి: మండలంలో శనివారంతో ఒంటిపూట బడులు ముగిశాయని ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. సోమవారం నుంచి ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 3:30 వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 9 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

జూపాడుబంగ్లా: పొలం, స్థలం విక్రయదారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వ్యయ, ప్రయాసాలకోర్చకుండా సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. శనివారం మండలంలోని పి.లింగాపురం గ్రామానికి చెందిన వెన్నం శ్రీరామరెడ్డి సర్వేనెంబర్ 63లోని 2.43ఎకరాల పొలాన్ని అతని భార్య వెన్నం వెంకటసుబ్బమ్మ పేరున దానవిక్రయ రిజిస్ట్రేషన్ చేయించారు. తరిగోపుల గ్రామసచివాలయంలో తహసీల్దార్ పుల్లయ్యాయాదవ్, సర్పంచ్ నాగార్జునరెడ్డి సమక్షంలో సచివాలయ ఉద్యోగులు విజయవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి ఎల్‌పీఎం నెంబర్. 245 ఇచ్చారు. వివరాలను పరిశీలించి నందికొట్కూరు సబ్‌రిజిస్ట్రార్ ఆమోదం తెలిపిన వెంటనే వెంకటసుబ్బమ్మ పేరున పత్రాలు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇకపై అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తైనట్లు లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్

కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలి



శ్రీశైలం గురుకుల ప్రిన్సిపాల్ జవహర్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ



పగిడ్యాలలో పదో తరగతి విద్యార్థులను సన్మానించిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



మహానందిలో అవార్డులు పొందిన విద్యార్థులతో ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుపై ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి అన్నారు. శనివారం జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో మండలస్థాయిలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయిలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీతో పాటు ఎంపీపీ సువర్ణమ్మ, వైఎస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంఈఓ తిమ్మారెడ్డి, సర్పంచ్ మొట్టెబాల స్వామి, ఎంపీటీసీ మోతెవెంకటమ్మ, ఎంఈఓ తిమ్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

విద్యార్థుల ఉన్నతికి ముఖ్యమంత్రి కృషి

పగిడ్యాల: విద్యార్థుల ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజనకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

మహానంది: విద్య, వైద్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద శనివారం జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కల్లె శ్రీలక్ష్మి, శవ్వా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ పిట్టల సునీత, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడి పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

మిడుతూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని మిడుతూరు జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంఈఓ మౌలాలి అధ్యక్షతన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభా చాటిన 12 పాఠశాలల విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందజేశారు. అనంతరం ఏపీ ఆదర్శ పాఠశాల నుంచి మండల టాపర్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థినులను(సృజన(570), ధరణి(552), వెల్దుర్తి కుశల(551)) పురస్కారాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వర రెడ్డి, ఎంపీటీసీ దేవమ్మ పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు నగదు బహుమతులు

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 సంవత్సరానికి గాను పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శనివారం స్టేట్ బ్రిలియంట్స్ అవార్డును విద్యాకమిటీ చైర్మన్ చంద్రకళ అందజేశారు. ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన రఘునందన్ నాయక్, వెంకటనారాయణ,ఉమామహేశ్వరి లకు బహుమతులు అందజేశారు.

జగనన్న ఆణిముత్యాలు గురుకుల విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: జగనన్న ఆణిముత్యాలుగా శ్రీశైలం మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ నగదు ప్రోత్సాహక బహుమతికి ఎంపికయ్యారు. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఆణిముత్యాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ బండ్లమూడి.జవహర్‌ని సత్కరించారు. పదవ తరగతిలతో కె.నవీన్‌కుమార్ జిల్లా ప్రథమ స్థానంలో రు.50,000, తృతీయస్థానంలో ఎస్.వంశీకృష్ణ రు.15,000ల నగదు బహుమతిని కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు



జూపాడుబంగ్లాలో విద్యార్థి చెన్నకేశవ ఆచారి, తండ్రి రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం



మిడుతూరులో ఆదర్శ పాఠశాల విద్యార్థిని సృజనకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం



ఆత్మకూరులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామల

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఆత్మకూరు: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు శనివారం ప్రోత్సాహక బహుతులను అందజేశారు. ప్రిన్సిపాల్ శ్యామల ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కృపారాణి,జాస్మిత, దివ్యారాణిలను సత్కరించారు.